బూత్ బంగ్లాలు కాదు..
ఆర్ అండ్ బీ క్వార్టర్లు


అడవిని తలపిస్తున్న ఆర్ అండ్ బీ క్వార్టర్ల వద్ద మొక్కలు


పిచ్చిమొక్కల మధ్య ఆర్ అండ్ బీ క్వార్టర్


నాచుపట్టిన ఆర్ అండ్ బి క్వార్టర్లు

- చుట్టూ ముళ్లపొదలు
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని దుస్థితి
- పట్టించుకోని ప్రభుత్వం

సీతమ్మధార: అక్కడ ఏ ఇల్లు చూసినా బూత్ బంగ్లాని తలపిస్తుంది. ఏళ్ల తరబడి కనీసం ప్యాచ్‌వర్కులు కూడా చేయడం లేదని నివాసితులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. ఎప్పుడు భారీ వర్షాలు కురిసినా ఇక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బితుకుబితుకుమంటూ కాలం వెళ్లదీసే దుస్థితి నెలకొంది. ఇదీ నగరంలోని సీతమ్మధారలో గల రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) క్వార్టర్ల దుస్థితి. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ఇంజినీర్లు మరమ్మతులు చేయించలేని పరిస్థితి నెలకొంది. సాక్షాత్తూ ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయం కూడా సమీపంలోనే ఉన్నా ఇక్కడి క్వార్టర్ల జాతకం మాత్రం మారడం లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయి విష సర్పాలకు నిలయంగా మారుతోందని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. క్వార్టర్ల చుట్టూ పిచ్చిమొక్కలు అడవిని తలపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

సీతమ్మధారలో ఆర్ అండ్ బీ ఉద్యోగుల నివాసాల నిమిత్తం సంవత్సరాల కిందట 25 బ్లాకుల కింద.. ఒక బ్లాకులో నాలుగు వంతున క్వార్టర్లు నిర్మించారు. ఇందులో న్యాయశాఖకు నాలుగు బ్లాకులు కేటాయించారు. జిల్లా అధికారులకు రెండు బ్లాకులు కేటాయించారు. ఇక్కడ రెవెన్యూ శాఖ ఉద్యోగులు కూడా నివసిస్తున్నారు. తొమ్మిది బ్లాకులు జె టైపులో నిర్మించారు. మూడు బ్లాకుల కింద నిర్మించిన పి టైపు క్వార్టర్లలో 33 నివాసాలున్నాయి. ఇందులో నీటి పారుదల శాఖ ఉద్యోగులు నివసిస్తున్నారు. మూడు బ్లాకుల కింద నిర్మించిన ఎస్ టైపు క్వార్టర్లలో 12 నివాసాలున్నాయి. వి టైపు ఒక బ్లాకులో నాలుగు క్వార్టర్లు ఉన్నాయి. బి టైపు బ్లాకులు రెండు, సి టైపు బ్లాకులు రెండు ఉన్నాయి. సీతంపేట రాజేంద్రనగర్‌లో కూడా ఆర్అండ్‌బీ క్వార్టర్లు ఉన్నాయి. వి టైపు రెండు బ్లాకులు, సి టైపు ఒక బ్లాకు ఉన్నాయి. ఏయూ ప్రధాన ద్వారం ఎదురుగా కూడా ఆర్అండ్‌బీ క్వార్టర్లున్నాయి. ఇక్కడ నాలుగు బ్లాకుల్లో ప్రభుత్వ ఉద్యోగులు నివసిస్తున్నారు.

హుద్‌హుద్ సమయంలో..

ఆర్ అండ్ బీ క్వార్టర్లు 144 వున్నాయి. ఇందులో 130 వరకు నివాసాలను ఆర్ అండ్ బీ ఉద్యోగులు వినియోగిస్తున్నారు. ఇరిగేషన్ ఉద్యోగులు 14 నివాసాలు వినియోగిస్తున్నారు. మరో 60 క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇటు మరమ్మతులు, అటు ప్యాచ్‌వర్కులు చేయడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది. హుద్‌హుద్ సమయంలో ఇక్కడి క్వార్టర్లు బాగా దెబ్బతిన్నాయని నివాసితులు చెబుతున్నారు. అప్పట్లో ఏదో తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులిపేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వార్టర్లు బాగా దెబ్బతినడంతో రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద కూడా తీవ్రంగా ఉందని, ఆవులు కూడా ఇక్కడ తిష్ట వేసి దర్జాగా తిరుగుతున్నాయని నివాసితులు వాపోతున్నారు. క్వార్టర్ల వద్ద పంపు ఆపరేటర్లు, వాచ్‌మెన్లు కూడా విధులు నిర్వహిస్తున్నారు.

అధ్వానంగా నివాసాలు..

ఏళ్ల తరబడి కనీసం పెయింట్లు కూడా వేయకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. పైగా వర్షాలకు ఇళ్లన్నీ నాచుపట్టి జుగుప్స కలిగిస్తున్నా పట్టించుకున్న నాథుడే కరవయ్యాడు. గోడలపై కూడా పిచ్చి మొక్కలు మొలిచి క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తమవుతుంది. నిరుపయోగంగా ఉన్న క్వార్టర్లలో చెక్కలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఎప్పుడైనా వరుసగా మూడు లేదా నాలుగు రోజులపాటు వర్షాలు పడితే ఈ క్వార్టర్లు కూలిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక్కడ ఉన్నవారే సొంత నిధులతో చిన్న చిన్న మరమ్మతులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చీకటి పడితే చాలు ఇక్కడ ఎవరు వస్తారో, దొంగలు పడతారోనని స్థానిక ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి ఈ క్వార్టర్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.


బూత్ బంగ్లాను తలపిస్తున్న ఆర్ అండ్ బీ క్వార్టర్లు


మరమ్మతుకు నోచుకోని ఆర్ అండ్ బి ఏఈ క్వార్టర్

21న తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: ఈ నెల 21న జోన్–3 పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం కలగనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ టీఎస్సార్ నుంచి హైలెవెల్ రిజర్వాయర్‌కు వచ్చే ప్రధాన పంపింగ్ మెయిన్‌లైన్ మంచినీటి సరఫరా చేసే పైపులైన్ మరమ్మతులకు గురైన కారణంగా ఈ నెల 21 (సోమవారం) జోన్ పరిధి 22వ వార్డులో టైమ్స్ ఆఫ్ ఇండియా, సిద్ధార్థనగర్, 24వ వార్డు పాత రేసపువానిపాలెం, వినాయకనగర్, తులసీపేట, స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ఏరియా, 27వ వార్డులో అశోక్‌నగర్, రామాటాకీస్ రోడ్డు, శ్రీనగర్, బుధిల్‌పార్క్ రోడ్డు, రెడ్డి ఆస్పత్రి రోడ్డు, శ్రీనగర్ సాయిబాబా టెంపుల్ రోడ్డు, ద్వారకానగర్ రోడ్డు నెంబరు 1 నుంచి 6 లైన్ల వరకు, అమర్‌నగర్ చర్చి రోడ్డు, సీబీఎం కాంపౌండ్, రామాటాకీస్ లేడీస్ గేట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడనుందని, ట్యాంకర్ల ద్వారా మంచి నీటి సరఫరా జరుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గంజాయి రవాణా చేస్తున్న యువకులకు రిమాండ్

సీతమ్మధార: నగరంలో 3.5 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని నాలుగవ పట్టణ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాలుగవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల రైల్వేస్టేషన్ పోస్టాఫీసు వద్ద శుక్రవారం అక్రమ గంజాయి రవాణా అవుతోందని వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణలోని వనపర్తి జిల్లా పంగల్ మండలం రెయిన్‌పల్లి గ్రామానికి చెందిన కొంకల బ్రహ్మంనాయుడు (26), అదే ప్రాంతానికి చెందిన దండు పవన్ కుమార్ (23లను అరెస్టు చేసి వారి నుంచి 3.5 కిలోల గంజాయి, రెండు మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను శనివారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని పోలీసులు తెలిపారు. ఈ కేసుని నాలుగవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మురళీనగర్ : జోన్ – 2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్ – 2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

వైభవంగా సుప్రభాత సేవ


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో బాలభోగం, అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం : ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. తర్లాడ శిరీష తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం దుర్గానగర్‌లో నివసిస్తోంది. ఆమె నగరంలోని గురుద్వార సమీపంలో ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఈ నెల 17న కాలేజీకి వెళ్లిన శిరీష తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి పైడితల్లి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు


సూరిబాబు

మర్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యంపై అతని భార్య ఫిర్యాదు చేసింది. జ్ఞానాపురం రాస వీధిలో కుటంబ సభ్యులతో కలిసి నివసించిన సూరిబాబు గత నెల 25న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య గౌరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

మండే స్వభావం గల పదార్థాలు రైళ్లలో తీసుకెళ్లరాదు



తాటిచెట్లపాలెం: దీపావళి, పండగ సీజన్ కావడంతో ప్రయాణికులు తెలిసో, తెలియకో మందుగుండు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకుని ప్రయాణిస్తుంటారని, ఇలా చేయడం ప్రమదకరమని, నేరమని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. పండగల వేళల్లో దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంత గ్రామాలకు కుటుంబాలతో కలిసి వస్తుంటారని, ఈ సందర్భంగా రైళ్లు రద్దీగా ఉన్న సందర్భాల్లో టపాసులు, మందుగుండు సామగ్రి తమతో తీసుకుని ప్రయాణించడం 1989 రైల్వే చట్టం, 164,165 సెక్షన్ల ప్రకారం శిక్షించదగిన నేరమని తెలిపారు. అతిక్రమిస్తే మూడు సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానా లేదా రెండు శిక్షలు వేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రయాణికులకు ఈ విషయంలో అవగాహన కూడా కల్పిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ తగదు


దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 19వ రోజుకు చేరాయి. శనివారం దీక్షా శిబిరంలో పాల్గొన్న సీఐటీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె. సత్యనారాయణ మాట్లాడుతూ పోర్టు ఆస్పత్రి ప్రైవేటీకరణ నిర్ణయం పూర్తిగా కార్మికుల హక్కులు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను హరించేదిగా ఉందన్నారు. 386 కోట్ల లాభాలను ఆర్జించిన పోర్టు, 171 కోట్ల పన్నులను ప్రభుత్వాలకు చెల్లించిందని, అయినా పోర్టు ఆస్పత్రి నిర్వహణను ప్రైవేటుకు అప్పగించడం అన్యాయమన్నారు. దీక్షల్లో సీఐటీయూ నాయకులు శంకర్రావు, రాఘవులు, నాయుడు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని తూర్పారబట్టిన దేవిశ్రీ


గీతాలు ఆలపిస్తున్న ప్రజా గాయకుడు దేవిశ్రీ

సీతమ్మధార: చంద్రబాబు గారు.. వింటారా ఉత్తరాంధ్ర గోడు.. మా బాధను అసెంబ్లీలో ఎప్పుడు అడుగుతారు అంటూ ప్రజాగాయకుడు దేవిశ్రీ తాజాగా కూటమి ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఆయన ఆలపించిన గీతం శనివారం సోషల్ మీడియా ద్వారా వైరల్ అయింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడలేదా, శ్రీకృష్ణ కమిటీ చెప్పింది గుర్తులేదా, ఉద్దానం ప్రజలు ఊపిరి పోతుంటే ఉపాధి లేక మన గుంటలు వలస పోతుంటే, వైద్యమందక గిరిజనులు అల్లాడుతుంటే జనం గోడు పట్టకుంటే పదవులు ఎందుకంట అని దేవిశ్రీ సూటిగా ప్రశ్నించారు.

‘ప్రేమకు చిరునామా’ కథల సంపుటి ఆవిష్కరణ


కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సత్యవాడ సోదరీమణులు రచించిన ‘ప్రేమకు చిరునామా’ కథల సంపుటి ఆవిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రైటర్స్ అకాడమీ ఛైర్మన్ వి.వి.రమణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా కథల సంపుటిని ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కథా సంపుటిలో 18 కథలు ఉన్నాయని, మొదటి కథగా ప్రేమకు చిరునామా కథ చెప్పి ఆకట్టుకున్నారని అన్నారు. ప్రముఖ రచయిత డి.వి. సూర్యారావాఉ పుస్తక సమీక్ష చేస్తూ సత్యవాడ సోదరీమణులు జ్ఞానేనేత్రాలతో ఈ కథలు రాశారన్నారు. ఈ కార్యక్రమంలో బాలబాట సంపాదకురాలు స్వరాజ్యం వెంకట రమణమ్మ, నవలా రచయిత ఇందూ రమణ, రాజా వెంకన్న, మేడా మస్తాన్‌రెడ్డి, పలువురు సాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నసమారాధన ప్రారంభం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న స్వాములు

సీతంపేట: ఎరుమేలి అయ్యప్ప అన్నదాన సమారాధన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పోస్టు ఆస్పత్రి సమీపంలోని ఖాళీ స్థలంలో అయ్యప్ప, భవానీ మాలలు ధరించిన దీక్షా స్వాములకు అన్న సమారాధన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. రాజేటి శ్రీరామాచార్యులు ముఖ్య అతిథిగా హాజరై అన్న ప్రసాద వితరణ ప్రారంభించారు. ముందుగా పీఠంలో అయ్యప్పస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ నెల 19 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు 45 రోజుల పాటు అన్నప్రసాద వితరణ జరుగుతుందని ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని దీక్షా స్వాములు, భవానీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గద్దర్ వర్ధంతి నేడు

సీతమ్మధార: ప్రజా గాయకుడు గద్దర్ అన్న పాటలతో దుమ్ము దులుపుదాం రండి అని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ పిలుపు ఇచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గద్దర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి రాత్రి ఏడు గంటల వరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వేడుకలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, రాష్ట్రంలోని మేధావులు, పలు సంఘాలు, కళాసంస్థలు, ఉద్యమ నేతలు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మళ్లీ వర్షం

సీతమ్మధార: ఒక అల్పపీడనం వెళ్లిపోయింది అనుకునే లోపే మళ్లీ వర్షాలు పలకరించాయి. శనివారం సాయంత్రం మళ్లీ వర్షం కురిసింది. ఉదయం అంతా ఎండ మండిపోయింది. సాయంత్రం ఆకాశం మబ్బులు కమ్ముకున్నాయి. దీంతో వాతావరణం అకస్మాత్తుగా చల్లబడిపోయింది. సీతమ్మధార, గురుద్వారా, బాలయ్యశాస్త్రి లేఅవుట్, సత్యం జంక్షన్, నక్కవానిపాలెం, గాంధీనగర్, రేసపువానిపాలెం తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు, కాలువలు జలమయం అయ్యాయి. సీతమ్మధార రైతుబజార్ బోసిపోయింది. ఫుట్‌పాత్‌ల మీద వ్యాపారాలు చేసేవారు అకస్మాత్తుగా వర్షం పడడంతో ఇబ్బందులు పడ్డారు.

మహారాజా బ్యాంకుకు ‘బెస్ట్ కేవైసీ ఇనీషియేటివ్ అవార్డు’

సీతంపేట: మహారాజా బ్యాంకును ‘బెస్ట్ కేవైసీ ఇనీషియేటివ్ అవార్డు’ వరించింది. ఈనెల19వ తేదీన లక్నోలో జాతీయ స్థాయిలో జరిగిన ఫ్రంటియర్స్ ఇన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో మహారాజా బ్యాంకుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణవర్మ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకుకు ఈ అవార్డు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఎస్.హెచ్.లక్ష్మీదాస్, ఛైర్మన్ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోపరేటివ్ బ్యాంక్స్ బాబునాయర్, ఫౌండర్ మనోజ్ అగర్వాల్, మదన గోపాలస్వామి, దేశంలోని అన్ని కోపరేటివ్ బ్యాంకుల ఛైర్మన్లు, సీఈవోలు పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలు పరిష్కరించాలని వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం వార్డు కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వార్డులో పర్యటించి సమస్యలను గుర్తించి, పెండింగ్ పనులు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

దళిత, బహుజనులకు సమాన అవకాశాలివ్వండి

ఎంపీ గొల్ల బాబూరావు


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

సీతంపేట: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో ‘భారత రాజ్యాంగం, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, రిజర్వేషన్లు’ అనే అంశంపై అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ప్రవేశికలో అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని ఉందన్నారు. దీని ప్రకారం ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ దళిత, బహుజనులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. సమాన అవకాశాలు అందరికీ లభించేలా తనతో కలిసొచ్చే ఎంపీలతో కలిసి పార్లమెంట్‌లో కృషి చేస్తానన్నారు. అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌కు ఎంపీ ల్యాండ్స్ నుంచి రూ.50లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు మాట్లాడుతూ రిజర్వేషన్లు నీరుగార్చడానికి అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, కానీ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ జి. అర్జున, నాయకులు బయ్యే మల్లయ్య, ఐ.అనిల్‌కుమార్, వి.ఎస్.ఎస్.కుమార్, కె.రాంబాబు, వై.విజయకుమార్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నాసిరకం ఉల్లి


సీతమ్మధార రైతుబజార్‌లో ఉల్లిపాయల కోసం వినియోగదారుల క్యూ

సీతమ్మధార: రైతుబజార్‌లో శనివారం ఉదయం నాసిరకం ఉల్లిపాయలు విక్రయించడంతో వినియోగదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఉల్లిపాయల కోసం చాంతాండంత క్యూ ఉండడంతో వినియోగదారులు అధిక సమయం వేచి ఉండాల్సి వచ్చింది. తీరా ఉల్లిపాయలు చూస్తే వర్షానికి తడిసి నానిపోయి దుర్వాసన వస్తుండడంతో వినియోగదారులకు ఏం చేయాలో పాలుపోని దుస్థితి నెలకొంది. కర్నూలు ఉల్లిపాయలు అందుబాటులోకి రావడంతో మహారాష్ట్ర ఉల్లిపాయల ధరలు కూడా కొంత వరకు దిగొచ్చాయి. మహారాష్ట్ర సోలాపూర్ ఉల్లిపాయలు శనివారం ఉదయం కిలో రూ.47కి విక్రయించారు. సాయంత్రం సోలాపూర్ ఉల్లిపాయలు రూ.53కి విక్రయించారు. కర్నూలు ఉల్లిపాయల ధర రూ.37గా వుంది. సోలాపూర్ ఉల్లిపాయలు బాగా ఉన్నాయని వినియోగదారులు అంటున్నారు.

సమష్టి సహకారంతో సేవా కార్యక్రమాలు


మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రమౌళి


మురళీనగర్: వాకర్స్ క్లబ్ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజల ఆదరణ పొందగలిగామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సమష్టి సహకారంతో క్లబ్ ఆర్థిక పురోగతి, పార్కు అభివృద్ధి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఇతర క్లబ్‌లకు ఆదర్శంగా నిలిచామన్నారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల వివరాలను ఆయన ప్రకటించారు.

ఈనెల 27 ఉదయం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహణ, 31న వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకర ఆళ్వార్‌దాస్ 94వ జయంతి, నవంబరు 9న వాకర్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం, 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహణ, వాకర్స్ నూతన నిబంధనావళి ముసాయిదా ఆమోదానికి సర్వసభ్య సమావేశం, 4న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి నిర్వహిస్తామని తెలిపారు. క్లబ్ కార్యదర్శి బొల్లంగి ప్రసాదరావు క్లబ్ గత నెలరోజుల కార్యక్రమాల నివేదిక, కోశాధికారి జె.కూర్మారావు రాబడి, ఖర్చుల వివరాలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు మళ్ల రామకృష్ణ, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, బోర్డు సభ్యులు టి.వి. రమణ, వి. అప్పారావు, ఎస్.రామ్మోహన్‌రావు, జి.విజయలక్ష్మి, ఆర్.నాగేశ్వరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.ఎస్.ఆర్. కె.ప్రసాద్ తదిత రులు పాల్గొన్నారు.

ఘనంగా గార్వీ షరీఫ్ వేడుకలు

మర్రిపాలెం: గార్వీ షరీఫ్ వేడుకలు జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. హజరత్ గౌస్‌పాక్ నిషానీ వద్ద స్థానికులు ఫాతిహా నిర్వహించారు. అనంతరం ముస్లిం మత గురువులు ఖురాన్ శక్తులను వివరించారు. చిన్నారులు నాతే కలాంలు ఆలపించారు. మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో ప్రజలకు దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

జోన్–5 కమిషనర్‌కు అభినందనలు


జెడ్సీ రామును సత్కరిస్తున్న వెంకటరమణ

మర్రిపాలెం: ఇటీవల జోన్–5 కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.రాముని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శనివారం జోన్–5 కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువతో సత్కరించి, పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం


ఫుడ్ కోర్టు వ్యాపారులతో ఎమ్మెల్యే వంశీకృష్ణ

సీతంపేట: చిరు వ్యాపారులకు అండగా ఉంటామని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు. 31వ వార్డులో గల ఫుడ్ కోర్టు ప్రెసిడెంట్ పోలవరపు నరసింగ్ ఆధ్వర్యంలో ఫుడ్‌కోర్టు వ్యాపారులు 150 మంది శనివారం జనసేన పార్టీలో చేరారు. వారికి వంశీకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన నాయకులు శివప్రసాద్‌రెడ్డి, 27వ వార్డు అధ్యక్షుడు సురేష్‌బాబు, నారా నాగేశ్వరరావు, శ్రీనివాస్, మర్రివేముల శ్రీనివాస్, భయన సునీల్, తేజ, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య?

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. తుమ్మడిపాలెంలో చరణ్ రూప్ తేజ(16) తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి యువకుడి తల్లి, సోదరుడు వారి బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులు మూసివేసి ఉన్నాయి. ఎంతసేపటికీ తలుపులు తెరవకపోవడంతో అతడి సోదరుడు వాటిని బద్దలుకొట్టి చూడగా.. చరణ్ రూప్ తేజ చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేళాడుతున్నాడు. వెంటనే పోలీసులకు ఈ విషయం తెలియజేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి, శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఆ యువకుడు వన్‌టౌన్ ప్రాంతంలో ఓ యువతిని ప్రేమించాడని, ప్రేమ విఫలం కావడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.